ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ డెయిరీ ముట్టడి



డెయిరీ వద్ద పాల రైతుల ఆందోళన

- పాల సేకరణ ధర పెంచాలని డిమాండ్
- ప్రధాన గేట్లు ఎక్కి కార్యాలయం లోపలకు దూసుకెళ్లిన పాల రైతులు
- పోలీసుల అడ్డగింతతో ఉద్రిక్తత



గేట్లు తోసుకుంటూ డెయిరీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్తున్న పాల రైతులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

తగ్గించిన పాల సేకరణ ధరను తక్షణమే పెంచాలంటూ విశాఖ నగరం గాజువాక సమీపాన ఉన్న విశాఖ డెయిరీని ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన సోమవారం పాల రైతులు ముట్టడించారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో రైతుల నుంచి విశాఖ డెయిరీ యాజమాన్యం సేకరిస్తున్న ఆవు, గేదె పాలకు సంబంధించి రైతులకు కనీస ధరలు ఇవ్వాలని పెద్ద పెట్టున నినదించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ జరిగిన ఆందోళనా కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన పాడి రైతులు భారీగా పాల్గొన్నారు. డెయిరీ కార్యాలయంలోకి జొరబడ్డం రైతుల్లో యాజమాన్యం పట్ల పెరిగిన అసంతృప్తిని తెలియజేసింది. వర్షాన్ని సైతం లెక్కచేయక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన పాడి రైతులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ డెయిరీ గేట్లు ఎక్కి ఎమ్‌డి చాంబర్ వద్దకెళ్లి బైఠాయించారు. ఈ క్రమంలో మెయిన్ గేటు నుంచి లోపలకెళ్లేదారిలో రైతులకు, పోలీసులకు మధ్య అరగంటసేపు తోపులాట జరిగింది. ఉద్రిక్తత నెలకొంది. పాల రైతుల ఆందోళనకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు, అనకాపల్లి, విశాఖ జిల్లాల నాయకులు కర్రి అప్పారావు, నాయనిబాబు, గనిశెట్టి సత్యనారాయణ, రాంబాబు తదితరులు నాయకత్వం వహించారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)



విశాఖ నగరంలో వర్షంలోనే సాగుతున్న ప్రయాణాలు

పలు ప్రాంతాల్లో వర్షం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గడిచిన 24 గంటల్లో మోస్తరు వర్షం పడింది. అన్నిచోట్లా ఆగుతూ, కురుస్తూ ముసురు వాతావరణం నెలకొంది. ఆర్‌కె బీచ్‌లో సోమవారం సముద్ర అలలు ఎగిసిపడ్డాయి. విశాఖ, భీమిలి, పూడిమడక తీర ప్రాంతాల వెంబడి చల్లని గాలులు వీచాయి. కోసిన వరిచేను పొలాల్లోనే ఉండిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన కొనసాగుతోంది.

అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 48 గంటలలోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఆర్‌డిఒ శ్రీలేఖ, మిగతా 2లో..

ఒకరోజు కాలేజీకి రాలేదని కరస్పాండెంట్ దాష్టీకం

▶ వార్త 5లో..

7న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

▶ వార్త 4లో..

విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని ధర్నా

▶ వార్త 5లో..

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా దారి మళ్లించనున్నట్టు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 13351 ధన్‌బాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 2, 4, 6, 7, 9, 11, 13, 14 తేదీల్లోనూ, 12376 జసిదిహ్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 4, 11 తేదీల్లోనూ, 18637 హతియా - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 7, 14 తేదీల్లోనూ, 12889 టాటా నగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 6, 13 తేదీల్లోనూ, 22837 హతియా - ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 2, 9 తేదీల్లోనూ సాధారణ మార్గం నిడదవోలు - తాడేపల్లిగూడెం - ఏలూరు మీదుగా కాకుండా మళ్లించిన మార్గమైన నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయి. ప్రజలు ఈ మార్పులను గమనించాలని అధికారులు కోరారు.

ఇగ్నో వార్షిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. మొబైల్ ఫోన్స్ వంటి సాంకేతిక ఉపకరణాలను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించలేదు. ఇగ్నో జారీ చేసిన గుర్తింపు కార్డును తీసుకువచ్చిన వారినే పరీక్షా కేంద్రాల్లోకి పంపించారు.

భారీగా గంజాయి పట్టివేత

సబ్బవరంలో 167, విశాఖలో 122 కిలోలు స్వాధీనం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వేర్వేరు చోట్ల గంజాయి పట్టుబడింది. పోలీసులు పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించి 289 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు.



గొట్టివాడ జంక్షన్‌లో పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి - సబ్బవరం : కారులో తరలిస్తున్న 167 కిలోల గంజాయిని మండలంలోని సబ్బవరం-చోడవరం రోడ్డులో గొట్టివాడ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం పట్టుకున్నట్లు పరవాడ డిఎస్‌పి కెవి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం సబ్బవరం పోలీసు సేషన్‌లో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు అందిన ముందస్తు సమాచారం మేరకు స్థానిక సిఐ పిన్నింటి రమణ, ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో కలసి ఆదివారం సాయంత్రం గొట్టివాడ జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ స్కూటీపై ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తున్న కారుకు పైలట్లుగా వస్తుండగా వారిని పట్టుకొని ప్రశ్నించగా పాడేరు నుండి గంజాయి వెనుక వస్తున్న కారులో ఉందని తెలియజేశారు. దీన్ని గమనించిన వెనుక వస్తున్న కారులో ఉన్న వ్యక్తులు కారును వెనక్కి తిప్పి వెళ్ళడానికి ప్రయత్నించగా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. కారులో నుండి ఒక వ్యక్తి దిగి పారిపోయాడు. కారులో 77 పాకెట్లలో ఉన్న 167 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

భారీగా గంజాయి పట్టివేత

డ్రైవర్ కొమ్ము సతీష్ కుమార్‌తో పాటు స్కూటీపై పైలట్లుగా వచ్చిన డిప్పల మహేష్, మాతే గిరిలను అరెస్ట్ చేశారు. ఎఎస్ఆర్ జిల్లా హుకుంపేట మండలం, గూడ పంచాయితీ, మాలగూడ గ్రామానికి కొమ్ము సతీష్ కుమార్‌పై ఒక కేసు, పాడేరు మండలం డోకులూరు పంచాయతీ గోందూరు గ్రామానికి చెందిన డిప్పల మహేష్‌పై మూడు కేసులు గతంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు మాతే గిరి పాడేరు మండలం బోర్డమామిడి పంచాయతీ వంజంగి గ్రామానికి చెందిన వాడు. పరారీలో ఉన్న నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లు, ఒక కారు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను కోర్టుకు తరలించారు. గంజాయిని పట్టుకున్న పోలీసు సిబ్బందికి డిఎస్‌పి అభినందించి, రివార్డు ప్రకటించారు.

విశాఖలో ఇలా..

ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురు సభ్యులను అరెస్టు చేశామని, మరొక ముగ్గురు పరారీలో ఉన్నారని విశాఖపట్నం డిసిపి లా అండ్ ఆర్డర్ -1 అజిత వేజెండ్ల తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమకు ముందుగా అందిన సమాచారం మేరకు అల్లిపురం సమీపంలోని అచ్చియమ్మ పేటలో ఆదివారం ఉదయం సోదాలు నిర్వహించగా రెండు పెట్టెలు, మూడు సంచులలో 64 గంజాయి ప్యాకెట్లు దొరికాయన్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ధనుంజయ్ కుమార్, ప్రదుమాన్ రే అనే ఇద్దరు గంజాయి పెడ్లర్లు, ఇంద్ర దేవ్ రే, సంతోష్ కుమార్ అనే ఇద్దరు గంజాయి ట్రాన్స్‌పోర్టర్లను గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఒడిశాకు చెందిన శంకర్ పూజారి, ఢిల్లీకి చెందిన రాజేశ్వర్, పర్వేజ్ పరారీలో ఉన్నారని చెప్పారు. నిందితుల నుంచి 122 కిలోల గంజాయితో పాటు మూడు ఆండ్రాయిడ్ ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో ఈస్ట్ ఏసిపి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ

జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో స్వయంగాకానీ, ఫోన్ ద్వారాగానీ మాట్లాడి సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని కోరారు.

సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలివ్వండి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ఈ ఏడాది కూడా నగరంలో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, దీనికి ప్రజలు విరివిగా విరాళాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రంలో సాయుధ దళాల పతాక దినోత్సవం పై సమీక్షించారు. ఈనెల 7న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుప నున్నామన్నారు. గత సంవత్సరంలో రాష్ట్రంలోని పతాక నిధికి అత్యధికంగా విరాళాలు రూ.24,48,729 సేకరించినందుకు విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానం పొందిందన్నారు. గత సంవత్సరం సాయుధ దళాల పతాక నిధికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ (యుసిడి), డిఆర్‌డిఎ, విద్యార్థులు, ఇతర ప్రజల నుండి విరాళాల ద్వారా ఆ మొత్తం వసూలు అయ్యిందన్నారు. 2024 సంవత్సరానకు జిల్లా విద్యా శాఖ అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు విద్యార్థుల నుండి, ఇండస్ట్రీస్ లో పనిచేసే వర్కర్స్ నుండి విరాళాలు సేకరించాలని కోరారు. పతాక నిధికి స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్ల అమ్మకం ద్వారా విరాళాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. సత్యానందం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వన్ టౌన్ బురు జుపేటలో ప్రసిద్ధి చెందిన కనకమాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి దేవాలయం మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి వార్డు అధ్యక్షులు, ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో తిరుమాళేశ్వర రావు, ఈఈ రమణ పాల్గొన్నారు.

మెరిట్ లిస్ట్‌లో అవకతవకలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల ఉద్యోగోన్నతుల మెరిట్ లిస్ట్ తయారీలో జరుగుతున్న అవకతవకలను ఆపాలని, అవకతవకలకు పాల్పడుతున్న, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామూహిక వినతి పత్రాన్ని ఏపి యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ విశాఖ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల హెల్త్ సెక్రటరీల ఉద్యోగోన్నతి మెరిట్ లిస్ట్ తయారీలో జరుగుతున్న అవకతవకలను ఆపాలని డిమాండ్ చేశారు. వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గత నెల 11న ఫిర్యాదు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చామన్నారు. అయినప్పటికీ డిఎం అండ్ హెచ్ఒ, ఆఫీసర్లు కనీసమైన జవాబుదారీతనాన్ని కనపర్చలేదన్నారు. గత్యంతరం లేక మళ్ళీ ఈ రోజు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు ఆళ్ల దేవకి, విశాఖపట్నం అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, జిల్లా నాయకులు రత్నం, కల్యాణి, రాజ్యలక్ష్మి, రాణి, భాగ్యలక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెడుతున్న పాలకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగా కర్మాగారాన్ని కోలుకోలేనంత నష్టాల్లోకి పాలకులు నెడుతున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1391వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూములను కాజేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చేసి కేంద్రంతో మాట్లాడి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరారు.

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, విశాఖ ప్రజల మనోభావాలతో ముడిపడి ప్రజల రక్తం నుంచి, కార్మికుల చెమట చుక్కల నుంచి వచ్చిన మహోద్యమమని, ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించే వరకు పోరాడుతామని సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 1343వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, హాస్పిటల్ కార్మికులు లక్ష్మీ, రమ, శ్రీను, సిఐటియు నాయకులు నాగమణి, ఆటో యూనియన్ నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న సిఐటియు కార్యకర్తలు

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం, సోమునాయుడుపాలెం, రావాడ గ్రామాలలో ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌టిపిసి సింహాద్రి మొబైల్ హెల్త్ కేర్ యూనిట్ వైద్యులు డి.ప్రశాంత్, ప్రణీత్ కుమార్ ఎయిడ్స్ నివారణ మార్గాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వెన్నెలపాలెం ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, పైల సన్యాసిరావు, జనసేన నాయకులు పీవీ నర్సింహారావు, వెన్నెల ఈశ్వరరావు, గ్రామ పెద్దలు బి.నాయుడు, పి.ప్రసాద్, మొబైల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : పెద వాల్తేరులోని కెడిపిఎం ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళీమోహన్ పాల్గొని ఎయిడ్స్ చరిత్ర, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవి మహమ్మారిని అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతీ బాయి, కెడిపిఎం హైస్కూల్ సిబ్బంది, గీతం మెడికల్ కాలేజీ ఇంటర్న్స్ అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులను సమకూర్చనున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన సత్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృది పనులను , ఘాట్ రోడ్డును పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో జాప్యం చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, ఈవో రాజుగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ దరి ది హోలీ క్రాస్ చర్చిలో రైటర్, రెవరెండ్ డిజె.విల్సన్ బాబు ఆధ్వర్యంలో కిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విల్సన్ బాబు మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ప్రతి ఏటా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

భయం గుప్పెట్లో కొండవాలు ప్రజలు



ఆరిలోవ ప్రాంతంలో కొండలపై ఉన్న ఇళ్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : తుపాన్లు, భారీ వర్షాలు వస్తున్నాయంటే చాలు కొండవాలు ప్రాంతాల ప్రజలు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. చిగురుటాకులా వణికిపోతూ బిక్కు బిక్కుమని జీవనం సాగిస్తారు. ఎక్కడ తమ నివాసాల మీద కొండ చరియలు విరిగి పడతాయోనని భయం వారిని వెంటాడుతుంది. హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకు సుమారు మూడు కిలో మీటర్ల విస్తరణలో సుమారు కొన్ని వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. భారీ వర్షాలు కురిసినా, తుపానులు గతంలో వచ్చినప్పుడు మట్టి పెళ్లలు, పెద్ద పెద్ద బండరాళ్లు జారిపడిన ఘటనలు, చాలా మంది నిరాశ్రయులైన, గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఇక్కడ నివాసముండే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని భయపడిపోతున్నారు. జివిఎంసి 9, 12, 13 వార్డుల పరిధి కొండవాలులో సుమారు 18 కాలనీలు ఉన్నాయి. హనుమంతువాక, విజయదుర్గాకాలనీ, క్రాంతినగర్, సంజయ్‌గాంధీ కాలనీ, ప్రశాంతినగర్, సింహగిరి కాలనీ, వినాయకనగర్, పెదగదిలి ఎస్‌సి కాలనీ, పెదగదిలి శివాలయం, ఈశ్వరదేవీనగర్, సాలిపేట, బాలమురళీనగర్, చినగదిలి, రాధాకృష్ణానగర్, రామలక్ష్మణపురం, లలితమ్మ ఆలయం, సిద్ధార్థ బిసీకాలనీ, నేతాజీనగర్, దీనదయాల్‌పురం కాలనీల్లో ఏళ్లతరబడి ఈ ప్రమాదం అంచున నివాసముంటున్నారు. రక్షణ గోడలు నిర్మించి వారిలో భయాలు కొంతవరకైనా పోగొట్టాలని ఈ ప్రాంతాల ప్రజలు వేడుకుంటున్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు బోయివీధిలో ఉన్న సామాజిక భవనం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యాన సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, కొక్కిరి అప్పన్న, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : నియోజకవర్గ పరిధిలో గల నలుగురు వికలాంగులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ద్వారా సోమవారం ఎంవిపి.కాలనీలోని అతని నివాసంలో ట్రైసైకి ళ్లు అందజేశారు. ట్రైసైకిళ్లు అందుకున్న వారిలో రీసు సాయి, చిన్న, సంధ్య, ఎస్.అప్పారావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఎన్.రాజు, నాయకులు అంగటి రాము, బిఆర్‌బి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి -మధురవాడ : కార్తీక మాసం ఆఖరి రోజు పోలి పాడ్యమి సందర్భంగా సోమవారం పిఎం పాలెం ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న శ్రీ షిరిడి పద్మ సాయి ఆలయంలో ఎండ్ల మల్లేశ్వరస్వామి ఆలయం నందు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి పరుశురామయ్య దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, పిన్నింటి రాంబాబు, పిల్లి పాపారావు, గొల్లంగి ఆనందబాబు, నారాయణరావు, సర్వ దేవుళ్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం సింగనబంద పంచాయతీ డొకరపేట రామాలయం వద్ద అయ్యప్ప భక్తులకు సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు ప్రారంభించారు. జెడ్‌పిటిసితోపాటు స్థానికులు కె.ఈశ్వరరావు, గాడు సన్యాసినాయుడు, ఎస్.సత్యనారాయణ, గాడు అప్పలనాయుడు ఆధ్వర్యాన 41 రోజుల పాటు ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత ఎవిఎన్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యాన అంతర్ కళాశాలల పురుషులు ఫుట్ బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా ఈ పోటీలు జరగగా 7 కళాశాలలకు చెందిన 7 జట్లు విజయం కోసం పోటీ పడ్డాయి.

ఉత్సాహంగా రచయితలు, కవుల సమ్మేళనం



పలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానికంగా సోమవారం రచయితలు, కవుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హాజరైన కవులు, రచయితలు తమ ప్రసంగాల్లో సమాజ హితం కోరే రచనలు, కవిత్వాలు జనం హృదయాల్లో సుస్థిర స్థానాన్ని కలిగి ఉంటాయన్నారు. ఎం.సుగుణాకరరావు రచించిన కథా రచనలో మెళకువలు, కె.రామ్మోహనరావు రచించిన కథా ఇతివృత్తం ఎలా తీసుకుంటారు, ఎం.భానోజీరావు రచించిన నా మొదటి కథ అనుభవం, ఎస్.మాధవి రచించిన కథా ఇతివృత్తాలను ఎలా తీసుకుంటారు పుస్తకాలను సభలో ప్రస్తావిస్తూ వాటి నేపథ్యాన్ని వివరించారు. పలు పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. కళా సాహితీ సంస్థ స్థానిక అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు అప్పలనరసయ్య, కార్యదర్శి సన్యాసిరాజు, కోశాధికారి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భీమిలిలో ఉన్న పలు చారిత్రక, పురాతన కట్టడాలను, సందర్శనీయ స్థలాలను సందర్శించారు.

కృత్రిమ మేధపై పోస్టర్ ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : ఐటి రంగంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్న కృత్రిమ మేధ, డేటా సైన్స్‌లపై విద్యార్థుల నుంచి సరికొత్త ఆలోచనలను ప్రోత్సహించడానికి, ప్రస్తుత ఐటి రంగంలో కృత్రిమ మేధ అమలులో ఎదురవుతున్న సవాళ్ళకు పరిష్కారాలను చూపే విధంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ లోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ) విభాగం విద్యార్థులకు కేస్ స్టడీ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో భాగంగా విద్యార్థులు తమ పరిష్కార మార్గాలను సైంటిఫిక్ పోస్టర్ రూపంలో ప్రదర్శించారు. మొత్తం 28 విద్యార్థి జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సిఎస్ఇ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ సిహెచ్.శాంతి, డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్, అసోసియేట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఎస్.రాజ్‌కుమార్, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.లక్ష్మీశ్వరి, కృత్రిమ మేధ విభాగాధిపతి డాక్టర్ కె.నవీన్‌కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్ విభాగాలలో నూతన ఆలోచనలను ప్రతిబింబించే విధంగా పోస్టర్ ప్రదర్శన ఉందని కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఐఐఎమ్ విశాఖపట్నం నిపుణుడు డాక్టర్ శివశంకర్ సింగ్ పటేల్ పేర్కొన్నారు.

పాఠశాల వందేళ్ల ఉత్సవ ఏర్పాట్లు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న వందేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు, పాఠశాల ఉత్సవ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు సూచించారు. ఎంవిపి.కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం పాఠశాల ఉత్సవ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల భవనం ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉన్నందున ఈ నెల 28, 29 తేదీల్లో ఉత్సవ నిర్వహణ సాధ్యపడదని, ఫిబ్రవరి 22, 23 తేదీల్లో నిర్వహించాలని ప్రకటించారు.

ప్రభుత్వ, సిఎస్ఆర్, పూర్వ విద్యార్థుల నుంచి నిధుల సేకరణ ద్వారా పాఠశాల భవనం పెయింటింగ్, మరమ్మతు పనులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భీమిలి ఆర్‌డిఒ కె.సంగీత్‌మాధుర్, డిఇఒ ప్రేమ్‌కుమార్, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, సమగ్ర శిక్ష ఇఇ నరసింహారావు, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అనంతపద్మనాభ స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -పద్మనాభం : శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో 2023 డిసెంబర్ 12 నుంచి 2024 డిసెంబర్ 2వ తేదీ వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. కుంతీమాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో సుమారు 30 మంది సభ్యులతో లెక్కించారు. మండలంలోని పాండ్రంగి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి గ్రూప్ సభ్యులు 12 మంది పాల్గొన్నారు. సుమారు రూ.ఐదు లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ నానాజీబాబు తెలిపారు.

వికె.పాలెం శివాలయంలో..

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్ పాలెం గ్రామానికి చెందిన శివాలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు హుండీని లెక్కించారు. రూ.5400, ఒక బంగారం ఉంగరం వచ్చిందని ఆలయ కమిటీ సభ్యులు బి.అప్పలనాయుడు, కె.రామకృష్ణ, ఆర్.ముత్యాల అప్పడు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ పరిధి టి.నగరపాలెం, టి.గొల్లలపాలెం, గొల్లలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులకు సోమవారం తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి.మల్లికార్జునరావు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరంగా పలు సూచనలు చేశారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన టి.నగరపాలెం ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, శేఖర్‌బాబు, హెచ్ఎంలు ప్రతాప్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా మహేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారిగా (ఎఫ్ఎసి) ఎం.మహేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నెల్లూరు కేంద్రకారాగారం అదనపు పర్యవేక్షణాధికారిగా మహేష్‌బాబు పనిచేశారు. విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారిగా పనిచేసిన ఎస్.కిషోర్ కుమార్ అనంతపురం జైలుకు బదిలీపై వెళ్లారు. విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.మహేష్‌బాబుకు కేంద్రకారాగారం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : రక్త దానంతో ప్రాణదాతలు కావచ్చని ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. సోషల్ వర్క్ విభాగంలో సోమవారం లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యాన రక్త దాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసింహారావు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో మనం చేసే రక్తదానం ఎంతో మందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుందన్నారు. సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక స్పృహ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి సలోమి, శ్యామ్, ఆశాకిరణ్, వేసవిల, పుష్ప, లక్ష్మణరావు, శిరీషా, సూరిబాబు, అమిత, లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ సుమన, డాక్టర్ కిరణ్ లలిత, అరుణ సాయి, లక్ష్మణ్, లలిత, కనక మహాలక్ష్మి, జ్యోతి సాబత్, జగదీశ్, సంజు తదితరులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన జపాన్ తొయామా వర్సిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని జపాన్‌లోని తోయామా ప్రొఫెక్చరల్ యూనివర్సిటీ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. తోయమా వర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ టెక్సో హతకేయమ ఆధ్వర్యాన నిపుణుల బృందం సందర్శించి అధికారులతో భేటీ అయ్యారు. ముందుగా ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు జపాన్ బృందానికి ఎయు ప్రాధాన్యతను వివరించారు. ఎయులో జపాన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ గతంలోనే ఏర్పాటు చేశామని, ప్రతి సంవత్సరం జపాన్‌కు తమ విద్యార్థులు వస్తున్నారని తెలిపారు.

అనంతరం జపాన్ ఆచార్యుడు హతకేయమా మాట్లాడుతూ, తొయామా వర్సిటీలో ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్, ఫ్యాకల్టీ ఆఫ్ నర్సింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అకాడమిక్ కొలాబరేషన్ కోసం తాము ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వచ్చామని తెలిపారు.



ప్రధానమంత్రికి పోస్టు కార్డులు పంపిస్తున్న ఐద్వా మహిళలు

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని విరమించుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపాలని, ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించాలని, విశాఖ ఉక్కును కాపాడుకొనేందుకు మహిళలు ముందుకురావాలని కోరుతూ ఐద్వా నాయకులు కూర్మన్నపాలెం ఫేస్-7లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా నాయకులు కె.వేణు మాట్లాడుతూ, ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బకాయి ఉన్న రెండు నెలల జీతాలను చెల్లించాలని డిమాండ్‌చేశారు. మాజీ కార్పొరేటర్ కె.విమల మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి మద్దతుగా పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా సోమవారం ఐద్వా స్టీల్ జోన్ కమిటీ ఆధ్వర్యాన పోస్టు కార్డులు రాసి ప్రధానమంత్రికి పంపించారు. ఇప్పటివరకు ఐద్వా ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పాదయాత్రలు, ధర్నాలు, మానవహారం, ఇంటింటికీ కరపత్రాలతో ప్రచారం, బహిరంగసభలు నిర్వహించినట్లు ఐద్వా నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు మైన్స్ కేటాయించాలని, ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.వరలక్ష్మి, యు.సుభాషిణి, ఎస్.ప్రభ, వి.సుమలత, పద్మావతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదలచేస్తున్న ఎయు వీసీ తదితరులు

7న ఎయు పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఆలుమ్ని అసోసియేషన్ జిఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 7వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ అండ్ టి గ్రూప్ చైర్మన్ ఎస్ఎన్.సుబ్రహ్మణ్యన్, ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు హాజరుకానునట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జిఎం.రావు, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు మాట్లాడుతూ, మధ్యాహ్నం మూడు గంటలకు బీచ్ రోడ్ లోని ఎయు కన్వెన్షన్ సెంటర్లో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం ప్రధాన సమావేశం ఉంటుందని తెలిపారు. ఆలుమ్ని అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ కుమార్ రాజా మాట్లాడుతూ, ఎయు వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఏటా డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 1500 మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మూడు వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎ.చంద్రశేఖర్, ఎయు రెక్టార్ ఆచార్య ఎన్.కోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్ ధనంజయరావు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్ విడుదల చేశారు.

లేబర్ కార్యాలయం వద్ద డెయిరీ కార్మికుల ధర్నా



అక్కయ్యపాలెంలోని లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న డెయిరీ కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన లేబర్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. డిసెంబర్ 30వ తేదీన జరిగిన జాయింట్ మీటింగ్‌కు యాజమాన్యం హాజరు కాకపోవడంతో కార్మికుల పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినదించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అధ్యక్షులు కెం.శ్రీనివాస్, విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వరాహమూర్తి, ప్రధానకార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ, డెయిరీ యాజమాన్యం గత 20 సంవత్సరాల నుంచి కార్మికులకు చట్టబద్ధంగా రావలసిన హక్కులను కల్పించడం లేదన్నారు. 15 సంవత్సరాల నుంచి అగ్రిమెంటు ట్రైనీలు పేరుతో ఉద్యోగాలను రెగ్యులర్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సెలవులు అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగ సంఘ నాయకులను, కార్మికులను ట్రాన్స్‌ఫర్, సస్పెండ్ చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. యాజమాన్యం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకుండా యూనియన్ లేదని, యూనియన్‌లో ఉన్న వారెవరూ ఉద్యోగులు కాదని యూనియన్ సర్టిఫికెట్‌ను వెరిఫై చేయమని లేబర్ అధికారుల కోరడం అత్యంత దుర్మార్గమైన విషయమన్నారు. లేబర్ కార్యాలయం వద్ద విశాఖ డెయిరీ ఉద్యోగస్తులందరూ తమ కంపెనీ ఐడెంటిటీ కార్డులు, పేస్లిప్పు చూపుతూ ధర్నా చేశారు. ఎంక్వైరీ ఆఫీసర్‌కు తమ వద్ద ఉన్న అన్ని రికార్డులను చూపించారు. విశాఖ డెయిరీలో యూనియన్ లేకుండా చేయాలని కార్మికులను సంఘం పెట్టుకోవద్దని యాజమాన్యం తీవ్ర ఒత్తిడి చేస్తుందన్నారు. పోటీగా కొత్త యూనియన్‌ను యాజమాన్యమే ఏర్పాటుచేస్తోందని తెలిపారు.

యాజమాన్యం తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 6వ తేదీ తర్వాత డెయిరీ ఉద్యోగులందరూ సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. డెయిరీలో 1300 మంది ఉద్యోగస్తులు పనిచేస్తుండగా వారిలో 960 మంది సిఐటియులో సభ్యులుగా ఉన్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులలో 600 మందికి గాను 540 మంది యూనియన్‌లో సభ్యులుగా, సమ్మె వల్ల ప్రజలకు సంస్థకు ఏర్పడేటటువంటి అసౌకర్యానికి పూర్తిగా యాజమాన్యందే బాధ్యత అని హెచ్చరించారు. తప్పుడు విధానాలను అమలు చేస్తున్న యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు నాయకులు నారాయణ, వెంకట అప్పారావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, త్రినాధ రావు, గంగాధరరావు, మూకు నాయుడు, వెంకటరమణ, అప్పారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యాన విశాఖ డెయిరీ వద్ద చేస్తున్న నిరవధిక రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, యాజమాన్యం కాలయాపన చేయకుండా ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికులను బానిసలుగా చూస్తున్నారన్నారు. హక్కులు అడిగితే కక్ష సాధింపు చర్యలు, బదిలీలతో కార్మికులపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కొనసాగుతుందని స్పష్టంచేశారు. సమ్మెకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా కార్మికులు విశాఖ డెయిరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.రాజేంద్రప్రసాద్, ఎం.రాంబాబు, ఎ.లోకేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో స్వచ్ఛతా పఖ్వాడా

ప్రజాశక్తి -కరాస: ఎన్ఎస్‌టిఎల్‌లో ఈ నెల 2 నుంచి 15వ తేదీ వరకు స్వచ్ఛతా పఖ్వాడా నిర్వహిస్తున్నారు. డిఆర్‌డిఓ నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) విశాఖపట్నం ఆధారిత ప్రీమియర్ నేవల్ రీసెర్చ్ నేవల్ లాబొరేటరీ, డిజిటలైజింగ్/ కలుపు తీయుటపై ప్రత్యేక దృష్టితో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి ఉద్యోగి మొదటి రోజు స్వచ్ఛత శపథం తీసుకున్నారు. స్వచ్ఛందంగా సంవత్సరానికి 100 గంటలు, అంటే వారానికి రెండు గంటలు పరిశుభ్రత కోసం, గ్రామాల్లో, పట్టణాల్లో స్వచ్ఛభారత్ మిషన్ సందేశాన్ని ప్రచారం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ఎన్.దాస్, ఇతర శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

గ్రీవెన్స్‌కు 2 అర్జీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు రెండు అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాదరావు తెలిపారు. శానిటేషన్ పనులపై ఒకటి, పేరు మార్పునకు సంబంధించి మరో వినతి వచ్చినట్లు శివప్రసాదరావు తెలిపారు. వీటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో తహశీల్దార్ రమేష్‌బాబు అర్జీలు స్వీకరించారు.



సత్యాగ్రహదీక్షలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కార్మికులు

సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలని సత్యాగ్రహదీక్ష

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఎన్ఎడి కార్మికులు, నాయకులపై ఉన్న సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎడి గేటువద్ద కార్మికులు సోమవారం సత్యాగ్రహదీక్ష చేపట్టారు. ఈ దీక్షనుద్దేశించి ఎఐడిఎఫ్ ఆల్ ఇండియా కార్మికవర్గ సభ్యులు పి.గోపాలపకృష్ణ మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకు బయోమెట్రిక్ వేసి డ్యూటీ చేసి సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్లాక రాత్రి 8 గంటలకు మళ్లీ డ్యూటీకి పిలవడం ఏమిటని ప్రశ్నించారు. ఇటువంటి పద్ధతి ఎన్ఎడిలోని మిస్సైల్ వరునాస్త్ర వర్క్ షాపుల్లో అమలు జరుపుతున్నారని తెలిపారు. ఎన్ఎడిలో జరుగుతున్న చట్ట వ్యతిరేక చర్యలపై ఎన్ఎడి సీఈ యూనియన్ ఇప్పటికే ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదుచేసిందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి ఎన్ఎడిని ఇష్టారాజ్యంగా ఏలుతున్న సిజిఎంపై విచారణ చేపట్టాలని కోరారు.

కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, ఎన్ఎడిలో సుమారు 600 మంది స్టోరేజీ ఓటీ 30వేల గంటల పైన ఉందని, నవంబర్ నెలలో దీనిని ఇవ్వకపోవడం వల్ల కార్మికులు రూ.60 లక్షలపైన నష్టపోయారని తెలిపారు. సిజిఎం మొండివైఖరే దీనికి కారణమన్నారు. కేంద్రం అండ చూసుకొని సిజిఎం లాంటివాళ్లు కార్మికులపై చెలరేగిపోతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వారికి బుద్ధిచెప్పాలన్నా, కార్మిక హక్కులను రక్షించుకోవాలన్నా ఐక్యపోరాటాలే మార్గమని చెప్పారు. విశాఖ జిల్లాతోపాటు రక్షణ రంగంలోని అన్ని యూనియన్లు ఒకే వేదికపైకి వచ్చి పోరాటం ఉధృతం చేయలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, అధ్యక్షుడు నూకరాజు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఒకరోజు కాలేజీకి రాలేదని కరస్పాండెంట్ దాష్టీకం

- విద్యార్థిని చితకబాదిన వైనం
- బైండోవర్ రాయించుకున్న పోలీసులు




విద్యార్థి చేతికి గాయమైన దృశ్యం, బాధిత విద్యార్థి రామ్‌చరణ్ గోపి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యార్థులను దండించరాదని ప్రభుత్వాలు ఎన్నిసార్లు ఆదేశించిన వాటిని బేఖాతరు చేస్తున్నారు విద్యా సంస్థల యజమానులు. పెద్ద పొరపాట్లు చేస్తే దండించవచ్చు కానీ కేవలం ఒకరోజు కాలేజీకి రాలేదని ఒక విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఇష్టం వచ్చినట్లు దండించి గాయపరిచారు. విద్యార్థి బంధువులు అందించిన వివరాల ప్రకారం... అనకాపల్లి మండలం మెట్టపాలెం గ్రామానికి చెందిన ముప్పల రామచరణ్ గోపి స్థానిక సాయి కుల్వంత్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రామచరణ్ నవంబర్ 30న కళాశాలకు హాజరు కాలేదు. సోమవారం యథావిధిగా కళాశాలకు వచ్చిన రామ్ చరణ్‌ని కళాశాల కరస్పాండెంట్ కామరాజు వెదురు కర్రతో చితగ్గొట్టారు. దీంతో గోపి చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. అంతే కాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలేజీలో కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న గోపి తండ్రి, మెట్టపాలెం సర్పంచ్ ముప్పల రాము కాలేజీకి వెళ్లి తమ కుమారుడిని ఇష్టం వచ్చినట్లు కొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. సీఐ విజయ్ కుమార్ కరస్పాండెంట్ కామరాజును తీవ్రంగా మందలించి ఇకపై ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేలా బైండోవర్ రాయించారు. దీంతో గోపి బంధువులు తల్లిదండ్రులు శాంతించారు. ఫీజులు కట్టకుంటే టీసీలు ఇవ్వకపోవడంపై కూడా కరస్పాండెంట్ కామరాజుపై పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించినా టీసీలు ఇవ్వని ఇటువంటి విద్య సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అయ్యన్న స్కూలుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక అయ్యన్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డుకు ఎంపికైంది. హైదరాబాద్‌కు చెందిన ఇటి టెక్ ఎక్స్ (ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ రిసోర్సెస్ టెక్నాలజీ ఎక్స్పో)-2024 ఇటిటెక్ ఎక్స్ ట్రయిల్ బ్లేజర్ అవార్డుకు అయ్యన్న స్కూల్‌ను ఎంపిక చేసినట్లు బ్రెయిన్ ఫీడ్ సంస్థ ప్రకటించింది. విద్యారంగంలో వినూత్న, ప్రయోగాత్మక, సృజనాత్మక విద్యా పద్ధతులను అవలంబిస్తూ, చక్కటి మౌలిక వసతులు కలిగిన స్కూల్‌గా గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశామని బ్రెయిన్ ఫీడ్ సంస్థ పేర్కొంది. డిసెంబరు 6వ తేదీన హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, రతన్ టాటా కాన్ఫరెన్స్ హాల్లో విద్యారంగంలో విశిష్ట నిపుణుల చేతుల మీదుగా ఈ అవార్డును అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం అందుకోనున్నారు. ఈ అవార్డుకు తమ స్కూల్ ఎంపికకావడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని డాక్టర్ ఖాశీం, డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి, హర్షం వ్యక్తం చేశారు.

వారపు సంతపై తుపాన్ ప్రభావం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతపై ఫెంగల్ తుపాన్ ప్రభావం పడింది. సోమవారం జరిగిన వారపు సంతకు గతంలో మాదిరిగా పెద్దగా జనం రాలేదు. దీంతో సంత వెలవెల బోయింది. ప్రతి సోమవారం పలు గ్రామాల నుండి అమ్మకాలు, కొనుగోలు కోసం పెద్ద సంఖ్యలో వచ్చే వారు. తుఫాన్ హెచ్చరికతో జనం పెద్దగా రాక చిరు వ్యాపారం చేసే వారు అమ్మకాలు లేక ఇబ్బంది పడ్డారు.

ఓటర్ల జాబితాను సవరించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దొప్పెర్ల గ్రామంలో అవకతవకలుగా నమోదైన ఓటర్ల జాబితాను సవరించాలని నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు స్వలాభం కొరకు డోర్ నెంబర్లు తప్పులు తడకగా వేసి వారికి అనుకూలంగా ఓటర్ల జాబితాలను తయారు చేయించాలని తెలిపారు. బూత్ నెంబరు 206 జాబితాను సవరించాలన్నారు.

పరవాడపాలెం రహదారిపై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం వద్ద జాతీయ రహదారి నుండి ఆ గ్రామానికి వెళ్లే సిసి రోడ్డుపై సోమవారం స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. దీనిని కశింకోట సీఐ అల్లు స్వామి నాయుడు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్ కుమార్, సర్పంచ్ బలిజ మంగ ముసిలినాయుడు, ఉగ్గిని రమణ మూర్తి యువకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దేవరాపల్లి గ్రామానికి చెందిన గుండు సూర్యనారాయణ కుమారులు ఈశ్వరరావు, రాంబాబులు రూ.50వేలు విరాళాన్ని మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, గ్రామ పెద్దలకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సిమ్మ అప్పన్న, సబ్బవరపు మాలిబాబు, అల్లు అబద్దం, కక్కల శ్రీను, బండారు అప్పలనాయుడు, చలపతి, సిద్దు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఫణీంద్ర కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయనగరం జిల్లాలో నవంబర్ 27 నుండి 30 తేదీ వరకు జరిగిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభలో ఆ సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్య పరిరక్షణ, అభివృద్ధికై ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ సమస్యల పరిష్కారానికై పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సిద్ధిలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శ్రీ సిద్ధి లింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ, ఏపియుఎఫ్ఐడిసి ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన కమిటీ అధ్యక్షులు అమరపల్లి కృష్ణాజీ, ధర్మకర్తలకు రాంకీ శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తలు

టాలెంట్ టెస్టులో విగ్నేష్ ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంటర్మీడియట్ విద్యార్థులలో ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు పెంటకోట పుష్పరాజు స్టూడెంట్ టాలెంట్ టెస్ట్‌ను నవంబర్ నెల 24న మునగపాకలో నిర్వహించగా, స్థానిక ఎఎంఎఎల్ కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి వై.తేజ విగ్నేష్ తన ప్రతిభను చాటి రూ.10వేలు బహుమతిని పొందారు. ఈ పరీక్షకు 1700 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 25 మందిని ప్రతిభావంతులుగా గుర్తించారు. వారిలో తేజ విగ్నేష్ ఒకరు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు, ట్రస్ట్ వారు అందజేసిన బహుమతిని విద్యార్థికి వారి తండ్రి సమక్షంలో సోమవారం అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, ఇంటర్ కోఆర్డినేటర్ టి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

లోటస్ వెల్ఫేర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం మల్ల జగన్నాథ కళ్యాణ మండపంలో లోటస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విల్లూరి రాజేష్ నిర్వహణలో ప్రముఖ వైద్య నిపుణులు రోగులను తనిఖీ చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ ఈ.సత్యనారాయణ, దంత వైద్య నిపుణులు బి రాజేష్ జోగి నాయుడు, హోమియో డాక్టర్ ఎం హేమంత్, గుండె వైద్య నిపుణులు ఎం శ్రీనివాసరావు రోగులను తనిఖీ చేశారు. గుండె రోగాలపై అవగాహన కల్పించారు. విల్లూరి వెంకట సత్యనారాయణ జ్ఞాపకార్థం మురళి, జై శ్రీమాన్, నాయుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తుపాన్‌తో వరికి నష్టం

ప్రజాశక్తి-కె.కోటపాడు : తుఫాన్ కారణంగా వీచిన గాలులు, కురిసిన వర్షాలకు వరి పంటకు నష్టం వాటిల్లింది. తమ పంటను రక్షించుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా మొదట వాయుగుండం, తరువాత తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో చాలామంది రైతులు తమ వరిచేలును ముందుగానే కుప్పలు వేసుకున్నారు. కొందరు రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. అయితే వాయుగుండం హెచ్చరికల తరువాత మొదటి మూడు రోజులు వర్షం లేకుండా ఎండ కాయడంతో కొద్దిమంది రైతులు కోతలు కోసి పొలాల్లో ఎండబెట్టారు. ఇంతలో తుపాన్ వల్ల వర్షాలు రావడంతో కోసిన వరి పనలు తడిసిపోయాయి. మరో వైపు ఇంకా కోత కోయని వరి పంట గాలులకు నేలకొరిగింది. దీనికి తోడు ఈ ఏడాది చాలా వరిచేలకు రెక్క దించే పురుగు సోకడంతో పొలాల్లోనే వరి కంకులు రాలిపోతున్నాయని, పంట నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

8న స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి-మునగపాక : ఉపాధ్యాయులు, రంగస్థల నాటక దర్శకులు మోతికా సాంబశివరావు మాస్టారు తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా ఈ నెల 8వ తేదీన కరీంనగర్ చైతన్య కళాభారతి వారిచే స్వప్నం రాల్చిన అమృతం అనే సాంఘిక నాటిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు స్థానిక నందీశ్వర నాట్యమండలి సభ్యులు తెలిపారు. స్థానిక నందీశ్వర కళా ప్రాంగణంపై ముందుగా మాస్టారు సంస్మరణ సభ జరుగుతుందని, అనంతరం నాటిక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ఈ మేరకు సోమవారం కళా ప్రాంగణం ఆవరణలో సంస్మరణ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మళ్ల సంజీవరావు, పెంటకోట సత్యనారాయణ, ఆడారి మహేష్, టెక్కలి వీర కొండలరావు, టెక్కలి సూరప్పారావు, మళ్ల చిన్న జగ్గారావు, మళ్ల కృష్ణ, ఆడారి సూర్యచంద్ర రామారావు, మళ్ల రామజగన్నాథం పాల్గొన్నారు.

ఆర్‌టిఇ చట్టం ద్వారా అడ్మిషన్ పొందిన

విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, తల్లిదండ్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యా హక్కు చట్టం ద్వారా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ అధిక మొత్తంలో ఫీజులు కట్టాలని ఈ విద్యార్థులను డిమాండ్ చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్య హక్కు చట్టం ద్వారా జాయిన్ విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో డీఈవోకి వినతిపత్రం ఇచ్చినా ఎటువంటి పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా చట్టాన్ని ఉల్లంఘించి ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇటువంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని, లేనియెడల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభాకర్ మాట్లాడుతూ విద్య హక్కు చట్టం ద్వారా తమకు సీట్లు కేటాయించిన నేపథ్యంలో తమ పిల్లల్ని ఆ స్కూల్లో జాయిన్ చేశామని, లేకుంటే తమ స్థాయికి తగ్గ స్కూల్లో జాయిన్ చేసే వాళ్ళమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా విద్యా సంవత్సరం మధ్యలో ఇటువంటి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె అర్జున్, జీ తరుణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి మంత్రి సానుకూలత



మంత్రికి ఇచ్చిన వినతిపత్రం చూపుతున్న రాజు తదితరులు

ప్రజాశక్తి-చోడవరం : బుచ్చయ్యపేట మండలం మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆనకట్ట శిథిలమై ఆరేళ్లు అయిందని, దీంతో కుమ్మంరానిపేట, మంగళాపురం, విజయరామరాజుపేట, దిబ్బపాలెం, దండి సురవరం, కట్టవాని అగ్రహారం, లక్ష్మీపురం, నరసయ్య పేట గ్రామాలకు సాగునీరు రాకుండా పోవడంతో సుమారు 3000 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకమైందని పేర్కొన్నారు. దీనిపై తాము మూడేళ్లగా పోరాడుతున్నామన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వంలో జలవనరులశాఖ మంత్రికి విన్నవించడంతో ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ మేరకు ఇరిగేషన్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కర్రి తమ్మునాయుడు, అల్లం రామఅప్పారావు, తుమ్మపాల రమేష్, నరవ సరోజిని పాల్గొన్నారు.

ఉన్నతి పథకం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉన్నతి పథకం పోస్టరును జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా 2018-2024 ఆర్థిక సంవత్సరాలలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 100 రోజులు పనిని పూర్తి చేసిన కుటుంబం నుండి 18-35 సంవత్సరాల వయస్సు గల అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతితో కూడిన శిక్షణ, 100 రోజుల కూలీ రేటు ప్రకారం స్కాలర్‌షిప్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 75 శాతం హాజరు వున్న అభ్యర్థులకు స్కాలరుషిప్‌తో పాటుగా శిక్షణ అనంతరం ప్రముఖ బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, బిజెఆర్‌యుఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.రమామణి, డ్వామా ప్రోజెక్టు అధికారి బి.పూర్ణిమదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ పాపునాయుడు, చిత్రంలో ఎస్ఐ శేఖరం

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-చోడవరం : మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ కెవై.పాపునాయుడు హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చోడవరం ఎక్సైజ్ శాఖ పరిధిలో నాలుగు మండలాల్లో 22 బ్రాండీ షాపులు ఉన్నాయని చెప్పారు. గతంలో 25 ప్రభుత్వం మద్యం దుకాణాలు వుండేవని, మిగిలిన మూడు షాపులు గీత కార్మికులకు మంజూరవుతాయని సూచనప్రాయంగా తెలిపారు. నెల రోజులు వ్యవధిలో 98 మంది ముద్దాయిలపై కేసు నమోదు చేశామని, వీరిలో 58 మంది నాటు సారా అమ్మేవారు కాగా, మిగతావారు ప్రభుత్వ లిక్కర్ అక్రమంగా తరలిస్తున్న వారని చెప్పారు. ప్రతి షాపు వద్ద సీసీ కెమెరాలు, ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, షాపులు వద్ద మద్యం సేవించడం నేరమని, అటువంటి వారిపై దృష్టి సారిస్తామని చెప్పారు. గంజాయి నియంత్రణలో భాగంగా విద్యా సంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన 27 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన నిందితులకు కోర్టు సమన్లు జారీ చేసిందని వారిని తీసుకొచ్చేందుకు బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం శేఖరం పాల్గొన్నారు.

హైస్కూల్‌లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పదో తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ పూర్తి చేసింది లేనిదీ ఆరా తీశారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వచ్చే టెన్త్ పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఎంఈఓ-2 బుద్ద కాశీ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూసారు. కార్యక్రమంలో హెచ్ఎం. పివి శేషు బాబు, వివి అప్పారావు, వెంకట్రావు పాల్గొన్నారు

తాతయ్యబాబుకు సత్కారం

ప్రజాశక్తి- వడ్డాది : తిరుపతి జిల్లాకు వెళ్లిన ఎపి గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్య బాబుకి అక్కడి రైల్వే స్టేషన్లో గృహ నిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా హౌసింగ్ కార్యాలయంలో జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, సిబ్బందితో సమావేశమై హౌసింగ్ నిర్మాణాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాతయ్యబాబును సత్కరించారు.

కుక్కల దాడిలో ఆవు దూడ మృతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : కుక్కల దాడిలో ఆవు దూడ మృతి చెందిన ఘటన మండలంలోని చిన అప్పన్నపాలెంలో గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు అమరపల్లి లక్ష్మీ నారాయణ సోమవారం ఉదయం తన పాకలో ఆవు దూడను కట్టేసి ఇంటికి వెళ్ళాడు. తిరిగి ఉదయం 9 గంటలకు వచ్చి పశువుల పాకకు వెళ్లి చూడగా ఆవు దూడను కుక్కలు కరిచి చంపివేశాయి. పట్ట పగలే కుక్కలు దాడి చేసి ఆవు దూడను చంపేయడంపై రైతు లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకసార్లు కుక్కలు దాడి చేయడంతో పశువులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయని, పిల్లలు, పెద్దలపైనా దాడి చేస్తున్నాయని, వాటి నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాతా శిశు మరణాల నివారణకు కృషి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మాతా శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రధాన అధికారిణి డాక్టర్ లూసీ కార్డిలియా ఆదేశించారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలలో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు జిల్లా గణాంకాధికారి రామచందరావు, డిపిఒ జగదీష్, ఐడిఎస్పి కోఆర్డినేటర్ జనార్ధన్‌తో కలిసి సోమవారం మండలంలోని హరిపాలెం పిహెచ్‌సి, ఇరువాడ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో క్షేత్రస్థాయి వైద్య రికార్డులు పరిశీలించి ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మానస, శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్, పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 231 అర్జీలు

మూడు రోజులలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 231 అర్జీలు అందాయి. పిజిఆర్ఎస్‌కు వచ్చిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 126, పోలీసుశాఖ 24, పంచాయతీరాజ్ 18, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించి అర్జీలు ఉన్నాయి. కలెక్టరు విజయకృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, డిఆర్ఒ బి.దయానిధి బిజిఆర్‌యుఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.రమామణి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం పిజిఆర్ఎస్ పెండింగు అర్జీలపై శాఖల వారీగా సమీక్ష చేసి, పరిష్కారంపై జిల్లా అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేసారు. పిజిఆర్ఎస్ వినతులపై మూడు రోజులలో చర్యలు తీసుకొని పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా రోజువారీ నివేదిక సమర్పించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా, పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని పిజిఆర్ఎస్ నోడల్ అధికారులను కలెక్టరు ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో 34 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 34 ఫిర్యాదులు అందగా, వాటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఐపీఎస్ మనీషా రెడ్డి, అదనపు ఎస్పీ ఎల్.మోహన్ రావు, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

పౌర హక్కుల ఫిర్యాదులపై మండల మెజిస్ట్రేట్ స్పందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పౌరహక్కుల ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులు స్పందించకపోవడంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌కు సోమవారం డివిఎంసి సభ్యులు, జై భీమ్ సేన నాయకులు రేబాక మధుబాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ జిల్లాలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా దళితులు అనేక సమస్యలు వెల్లడిస్తున్నారని, వాటిపై మండల మెజిస్ట్రేట్ నుండి స్పందన కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల సమస్యలు పరిష్కారం కాకపోగా, వారి శ్మశాన వాటికలు కూడా ఆక్రమణలకు గురికావడం బాధాకరమన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం, బిఆర్ అంబేద్కర్ విగ్రహం, గ్రంధాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేన సభ్యులు దుండు సూర్యనారాయణ, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మైలపల్లి పోతురాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డివిఎంసి సభ్యులు మధుబాబు

తీరంలో చేపలు మృత్యువాత

ఎపిఐఐసి జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారుల ధర్నా



చనిపోయిన చేపలు చూపుతూ నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఫార్మా పరిశ్రమలు విడుదల చేసే రసాయనిక వ్యర్థ పదార్థాలను పూడిమడక ఉప్పుటేరులో విడుదల చేయడం వలన తీరంలో చేపలు మృత్యువాత పడ్డాయి. వర్షాలు పడుతున్న సమయంలో పరిశ్రమలు రసాయనిగా పదార్థాలను ఉప్పుటేరులో విడిచిపెట్టడంతో చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా చనిపోయిన చేపల సంఖ్య విపరీతంగా పెరిగిందని మత్స్యకారులు తెలిపారు. ఎన్నిసార్లు మొరపెట్టిన అధికారులు పట్టించుకోకపోవడంతో సోమవారం ఉప్పుటేరులో చనిపోయిన చేపలను పట్టుకుని ఏపీఐఐసి జోనల్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చి ధర్నా చేశారు. వీరికి సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము మద్దతు తెలిపారు. సమస్య పరిష్కరించి మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఐఐసి జోనల్ మేనేజర్ కె హరి ప్రసాద్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఏపీ మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి చేపల తాతయ్య, రాజు, సన్యాసిరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : గృహ నిర్మాణశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గృహనిర్మాణశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో గృహనిర్మాణాలు, హౌసింగ్ కాలనీల్లో మౌళిక సదుపాయాలు, జల్ జీవన్ మిషన్ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్వాడి సెంటర్లలో మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సరఫరా ఏర్పాటు వంటి నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష చేసారు. గత వారం రోజుల్లో సాధించిన లక్ష్యాలను సమీక్షించి గృహనిర్మాణాల్లో పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసారు. నెలవారీ లక్ష్యాల చేదనలో ప్రతి వారం నిర్మాణ పనులు పురోగతి సాధించాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖకు సంబంధించి హౌసింగు కాలనీల్లో తక్షణం నీటి సదుపాయం కల్పించవలసిన అవసరం ఉందని, గృహనిర్మాణ శాఖతో సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేయాలని కోరారు. జెజెఎంపనులు, వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్వాడి సెంటర్లలో మరుగుదొడ్లనిర్మాణం, నీటి సరఫరా ఏర్పాటు నిర్మాణ పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా, జిల్లా ఇంజనీరింగు అధికారి ఎ.ఎస్.ఎ.రామస్వామి, ఇంజనీరింగు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఘంటసాల జయంతి వేడుకలు

- రాష్ట్ర స్థాయి పాటల పోటీలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-యలమంచిలి : స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ నెల 4న ఘంటసాల 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు పూరీ జగన్నాథ్ సోమవారం విలేకర్లకు తెలిపారు. కార్యక్రమం ఎమ్మార్వో ఆఫీసు దగ్గర అసోసియేషన్ వేదిక వద్ద జరుగు ఈ కార్యక్రమంలో 15 ఏళ్ల లోపు జూనియర్లు, 15 ఏళ్ల పైబడ్డ సీనియర్లుకు వేర్వేరుగా రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విజేతలైన సీనియర్, జూనియర్లకు వేర్వేరుగా ప్రథమ బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తో పాటు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పాటల పోటీలు 4వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమౌతాయని, ఈ పోటీల్లో పురుషులు ఘంటసాల పాడిన పాటలే పాడాలని, స్త్రీలు ఘంటసాల సంగీతం సమకూర్చిన పాటలు మాత్రమే పాడాలని సూచించారు ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు యువిఎస్ కొండలరావు (9110769864), ఇవటూరి సాంబశివరావు (9390877174) నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ విస్తరణాధికారిగా జ్యోతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల వ్యవసాయ విస్తరణాధికారి చిక్కాల జ్యోతి సోమవారం విధుల్లో చేరారు. రావికమతం మండలం గుడివాడ రైతు సేవ కేంద్రంలో విఏఏగా పని చేస్తూ పదోన్నతిపై బుచ్చయ్యపేట మండలం వ్యవసాయ విస్తరణాధికారిగా జ్యోతి వచ్చారు.

మాలల గర్జన సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ డిసెంబర్ 8 విశాఖలోనిగురజాడ కళాక్షేత్రంలో జరిగే ఉత్తరాంధ్ర మాలల గర్జన సభను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నియోజకవర్గ కన్వీనర్ కాటపల్లి అప్పారావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో పోరాట కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఉత్తరాంధ్ర మాలల గర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కర్రి సాయి సుందరరావు, మచ్చ వీర్రాజు, వేచలపు గంగాధరరావు, మచ్చ రామారావు, పరవాడ అప్పారావు, సబ్బవరపు మాలిబాబు, ఉల్లి శ్రీను, దువ్వాడ రమేష్, కాటపల్లి అప్పారావు (వెలుగు), మల్లేటి అర్జున్, కన్నాబత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

ప్రజాశక్తి-చోడవరం : మత్తు జీవితాన్ని చిత్తు చేస్తుందని చోడవరం సిఐ అప్పలరాజు అన్నారు. మత్తు పదార్థాల వినియోగం - దుష్పరిణామాలు అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చదువుకునే వయసులో మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమయ్యే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలకు అలవాటు పడి నష్టపోతున్నవారు చాలా మంది ఉన్నారని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ఆర్యే శిరీష, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డి మాల్యాద్రి, బిచ్చమ్మ, వైస్ ప్రిన్సిపల్ ఐవివి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రతిభ విద్యాలయంలో ఈ నెల 3, 4 తేదీలలో ప్రతిభ కప్ విశాఖ ఉమ్మడి జిల్లా అంతర పాఠశాలల బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు విన్నర్స్‌కి రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విశాఖ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు వారి పాఠశాలల తరపున పాల్గొనాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-చోడవరం : భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక వినాయక గుడి వద్ద శ్రీ బాలగణపతి తాపీ మేస్త్రి సంఘం అధ్యక్షులు కోన సూక రాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని హామీ ఇచ్చారని, ఆరు నెలలైనా నేటికీ పునరుద్ధరించలేదని తెలిపారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం

ప్రజాశక్తి -కోటవురట్ల:సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తుంది. ఈనెల 5న నోటిఫికేషన్ రానున్న తరుణంలో 8న ఎన్నికలు జరిపేందుకు చర్యలు తీసుకున్నట్లు సంబంధిత అధికారులు, రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు సంఘాల ఓటర్ల జాబితాను ఆయా ప్రాంతాలలో ప్రదర్శించారు.

మండలంలో 7 చిన్న నీటి తరహా నీటి సంఘాలు ఉండగా అందుకు సంబంధించిన రైతులు ఓటర్లు 1885 ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా మేజర్ తాండవ చానల్ సిస్టం నెంబర్ 10,12,13,14,15లో 1715 మంది రైతు ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మైనర్ కు 6గురు సభ్యులను ఎంపిక చేసి ఒకరిని అధ్యక్షులుగా ఎన్నుకుంటారు. మేజర్‌కు సంబంధించి 12 మంది సభ్యులను ఎంపిక చేసి ఒకరిని అధ్యక్షులుగా ఎన్నుకుంటారు. కాగా ఇప్పటికే ఆయా సంఘాలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. 9 సంవత్సరాల తర్వాత జరగనున్న ఎన్నికల పోరులో గ్రామాలలో ఎన్నికల సందడి కనిపిస్తుంది. ఓటర్ లిస్టును క్షేత్రస్థాయిలో రైతులను పరిశీలించి పారదర్శకంగా తయారు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.





పరిశీలిస్తున్న ప్రిన్సిపల్

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి- కోటవురట్ల:ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు శాతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన సంకల్ప్ ప్రత్యేక కార్యక్రమం మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఈనెల 1 నుండి ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు వీరిని తీర్చిదిద్దేందుకు ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యార్థులను ఏ,బి,సి, గ్రేడ్ లుగా విభజించి శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇందుకోసం పలువురు అధ్యాపకులను కేర్ టేకర్లు గా బాధ్యతలు అప్పగించారు. ఇందుకోసం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు.



బోరును ప్రారంభిస్తున్న ఎంపిపి

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రజలు దాహార్తి తీర్చేందుకుగాను మంచినీటి బోరు నిర్మాణం చేపట్టడం జరిగిందని గొలుగొండ ఎంపీపీ గజ్జలపు మణికుమారి అన్నారు. మండలంలో కొంగసింగి గ్రామంలో ఎంపీపీ నిధులతో చేపట్టిన మంచినీటి బోరును సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎస్సీ కాలనీలో ప్రజల అవసరాలు రీత్యా ఈ మంచినీటి బోరును నిర్మించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సత్యవతి, లగుడు శ్రీను, సాయి మంగరాజు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట:ఫ్రీ హోల్డింగ్ రైట్స్‌ను తక్షణమే రద్దు చేయాలంటూ సోమవారం రోలుగుంట మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆదివాసీలు ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ,

గత ప్రభుత్వం జిఒ నెంబరు 596 ద్వారా 20 ఏళ్ల క్రితం ఇచ్చిన బంజరు పట్టాదారులకు శాశ్వత హక్కులు కల్పిస్తామని చెప్పి పట్టాదారు లేదా వారి చట్టపరమైన వారసులే సాగు అనుభవం ఉండాలని షరతు పెట్టిందన్నారు.

రోలుగుంట మండలం పెదపేట గ్రామంలో స్థానిక ఆదివాసీలు 23ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిని సాగు చేస్తున్నారన్నారు. మామిడి తోటలు సాగు అనుభవాన్ని చేస్తున్నాయన్నారు. ఈ భూములకు స్థానికేతర్లకు డిఫారం పట్టాలు మంజూరు చేశారని, వాటిపై విచారణ జరపాలని ఆదివాసీలు అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వగా విచారణ కూడా జరపకపోగా స్థానికేతరులను సాగుదారులుగా చూపిస్తూ హక్కులు కల్పించడం అన్యాయమన్నారు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీలు



వర్షంలో సాగుతున్న వ్యాపారాలు

వర్షంతో చిరు వ్యాపారుల అవస్థలు

ప్రజాశక్తి -మాడుగుల: మాడుగుల కేంద్రంలో సోమవారం తేలికపాటి వర్షపు జల్లులు పడ్డాయి. తుఫాన్ ప్రభావం కారణంగా రెండు రోజులుగా మసురు వాతావరణం నెలకొంది. సోమవారం ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో కమ్మేసింది. కాగా తేలికపాటు జల్లులు కురవడంతో సోమవారం వారపు సంతకు వచ్చే వ్యాపారులు అవస్థలు పడ్డారు. పాస్టిక్ కవర్లు తలపై పెట్టుకుని వ్యాపారాలు సాగించారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని సోమవారం కార్తీక మాసం పరిష్కరించుకుని పోలీ పాడ్యమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని ఉపమాక శివాలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మహేష్, సతీష్ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ,యువకులు పాల్గొన్నారు.

రావికమతం:రావికమతం శివాలయంలో భక్తులు సోమవారం అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం అర్చకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఉపమాక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వరి పంటను పరిశీలిస్తున్న ఎఒ

రైతులు సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు పలు సూచనలు పాటించాలని మండల రైతులకు వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మీ కోరారు. పలు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోత కోసి పొలంలో ఉన్న వరి పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండడానికి ప్రతి లీటర్ నీటికి 50 గ్రాముల చొప్పున కల్లు ఉప్పు కలుపుకొని పనలపై పడేవిధంగా పిచికారీ చేయాలన్నారు. ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే వరి పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలని చెప్పారు. వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలన్నారు. గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల కార్బండిజం మాంకోజెబ్ లేదా 1 మి.లీ ప్రొపికొనజోల్ మందును పిచికారి చేయాలన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -రావికమతం: భర్త చనిపోయిన వితంతులకు పెన్షన్ మంజూరుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపిడిఓ కె వెంకన్న బాబు సోమవారం తెలిపారు. నవంబర్ 22న సెర్ప్ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీని ప్రకారం అర్హులు ఎవరైనా ఆయా గ్రామాల సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. ఇతర పెన్షన్ల మంజూరుకు ఇంతవరకు తమకు ఎటువంటి ఆదేశాలు అందలేదని వివరించారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రయోజనాలెన్నో...

- నేడు వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి- రావికమతం : విభిన్న ప్రతిభావంత పిలల సమగ్ర అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష- భవిత కేంద్రాలను స్థాపించి విద్య ,వైద్య సేవలు, సదుపాయాలు అందిస్తోంది. ఈనెల3న "అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం" సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను రావికమతం మండలం మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు తెలియజేశారు.అనకాపల్లి జిల్లాలో 21 రకాల వైకల్యాల దివ్యాంగ విద్యార్థులు సుమారు 3000 మంది ఉన్నారు. భవిత కేంద్రాల్లో మెరుగైన బోధన అందిస్తున్నారు. అతి తీవ్ర మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగ విద్యార్థుల ఇంటి వద్దకే వెళ్లి గృహాధారిత విద్యను అందించడం జరుగుతుంది.సర్వే ద్వారా గుర్తించిన పిల్లలకు భవిత కేంద్రాలలో ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ వంటి వాటిని కల్పిస్తూ బోధిస్తున్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపునకు ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం



బోధిస్తున్న ప్రతేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు

ప్రారంభంలో మే, జూన్ మాసాలలో సర్వే నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాలను అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష - పాఠశాల విద్యాశాఖ, అలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్స్, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు, వాకర్స్‌ను, కంటి అద్దాలు, వినికిడి యంత్రాలను అందించడం జరుగుతుంది."విజన్ 2025 - ఇన్ క్లూజివ్ ఆంధ్ర " అనే కార్యక్రమంలో భాగంగా డిజిటల్ నైపుణ్యాన్ని పెంపొందించడం కొరకు టాబ్‌లను ఉచితంగా అందించారు.పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పరీక్ష ఫీజు నుండి మినహాయింపు ఇస్తున్నారు. ఆయా వైకల్యాలను బట్టి మార్కుల ఉత్తీర్ణతలో మినహాయింపు కల్పిస్తున్నారు. 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైతే శారీరక వైకల్యం గల వారికి సంవత్సరానికి రూ.9000, మానసిక దృష్టి వైకల్యం విద్యార్థులకు 11 వేలు, కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ 14,600 చొప్పున ఇస్తున్నారు. "సహాయకుల భత్యం" (ఎస్కార్ట్ అలవెన్స్) కూడా ఇస్తున్నారు.క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యే విధంగా చేయడానికి ప్రతి నెల రూ.200 ప్రత్యేక అవసరాల గల దివ్యాంగ్ బాలికలకు 10 నెలల పాటు గరిష్టంగా రూ.2000 దివ్యాంగ బాలికల ఖాతాలో నేరుగా జమచేయబడుతుంది. గృహాధారిత విద్య పొందుతున్న పిల్లలకు నెలకు రూ.200 చొప్పున 10 నెలకు రూ.2000 బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ తేలికపాటి ఉచిత శస్త్ర చికిత్స చేయించుకున్న పిల్లలకు శస్త్రచికిత్స అనంతరం అవసరమైన వైద్య అవసరాలకై రూ.5,000లను ప్రోత్సాహంగా అందించడం జరుగుతుంది. ఈ విధంగా విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం పలు సౌకర్యాలు, రాయితీలు కల్పిస్తుంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు కోరారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-కోటవురట్ల:ఆటోవాలాలు ప్రయాణికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నిబంధనలు పాటించాలని స్థానిక ఎస్సై రమేష్ సూచించారు. సోమవారం ఆయన ఆటో స్టాండ్ వద్ద ఆటోవాలాలతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ప్రయాణికులను గమ్యానికి చేర్చడంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో వాహనాలు నడపాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రతి ఇంటికీ తాగునీరు

-హోం మంత్రి అనిత-జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటి అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేటలో రాజు గారి బీడులో జల జీవన్ మిషన్‌లో భాగంగా మంచినీటి ట్యాంకు నిర్మాణం, పైప్ లైన్ పనులకు సోమవారం ఆమె శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తామన్నారు. గతంలో కాలనీవాసులు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పాయకరావుపేట పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కోటి రూపాయల నిధులు కేటాయించి, త్వరలోనే నిర్మాణం చేపడతామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివధత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మోడల్ పోలీస్ స్టేషన్‌కు స్థల పరిశీలన

నక్కపల్లి:నక్కపల్లిలో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణా లకు హెూంమంత్రి వంగలపూడి అనిత సోమవారం స్థల పరిశీలన చేశారు. నక్కపల్లిలో పెట్రోల్ బంక్ పక్కన ఉన్న స్థలాన్ని పరిశీలించి, స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మోడల్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. పాయకరావుపేటలో కూడా స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ కుమారస్వామి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు, పార్టీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి,సత్తిబాబు, కె.వి వైబోయిన రమణ, జనసేన పార్టీ నాయకులు పాము గణేష్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న హోం మంత్రి అనిత


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిప్యూటీ డిఇఒ

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిప్యూటీ డిఇఒ అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి: టెన్త్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డిఇఓ అప్పారావు సూచించారు. మండలంలోని రాజయ్యపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు తరగతులను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు నరేష్, నూకరాజు, హెచ్ఎం నారాయణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరరావు

సమస్యలను అధికారులకు తెలపాలి

ప్రజాశక్తి- మాడుగుల:ప్రజలందరూ సమానమేనని, కుల మత వర్గ విభేదాలు లేకుండా కలిసి ఉండాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ మర్వాడ ఈశ్వరరావు సూచించారు. సోమవారం మండలంలో కేజె పురం స్థానిక ఎస్సీ కాలనీలో పౌరుహక్కుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జామి రమణ, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసిల్దార్ కే.రమాదేవి, ఎంపీటీసీ చిన్న లోవతల్లి రమణ బాబు, అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.


ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

ట్రాఫిక్ సమస్యతో సతమతం

ప్రజాశక్తి - మాడుగుల:మాడుగుల కేంద్రంలో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యతో వాహనదారులకు తీరని చింతగా మారింది. సాదారణ రోజులతో సైతం ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ఎవరికి నచ్చినట్టు వారు రోడ్లకు అడ్డంగా వాహణాలను నిలుపుదల చేసి వెళ్లి పోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సోమవారం, గురువారం జరిగే వారపు సంతల సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకునే పరిస్థితి లేనంతగా ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో ప్రజలు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణతో పాటు ఎం.కోడూరు వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక జూనియర్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం, కోర్టుకి వెళ్లే దారిలో దుకాణాలు ఇష్టానుసరంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ సమస్యను పరిష్క రించాలని పలువురు కోరుతున్నారు.

నోటరీతో సంబంధం లేకుండా..

జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేయాలి

-విద్యార్థులు, తల్లిదండ్రుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి -కొత్తకోట:గిరిజన గ్రామాలలో విద్యార్థులకు నోటరీ లేకుండా జనన, మరణ సర్టిఫికెట్స్ ఇవ్వాలని రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ నేరేడుబంధ. జీలుగులోవ, కళ్యాణపులోవ, రాయిపాడు, అజయ్ పురం గ్రామాలకు చెందిన గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆందోళన నిర్వహించారు. కళ్యానపులోవ గ్రామంలో నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు గెమిలి వాసు, తదితరులు మాట్లాడుతూ, పలు గిరిజన గ్రామాలలో 35 మంది పిల్లలకు జనన, మరణ సర్టిఫికెట్లు లేక పోవడంతో అపార్ యాప్ నమోదు చేయడానికి వీలుపడ లేదన్నారు. పంచాయతీ, సచివాలయంలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయాలంటే నోటరీ తప్పనిసరిగా ఉండాలని సిబ్బంది చెబుతున్నారన్నారు. ఐటీడిఏ నోటరీ లేకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తుందని, నాన్ షెడ్యూల్ మండలాలలో నోటరీ విధానం అమలు చేయడంతో సర్టిఫికేట్ కోసం కనీసం మూడు వేల వరకు ఖర్చులు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి వి టీ జి సంఘం నాయకులు కిలో సూరిబాబు, కొర్ర మహేష్. తదితరులు పాల్గొన్నారు


నినాదాలు చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉత్సాహంగా ఆటల పోటీలు


ఎఎల్.పురంలో ఆడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -గొలుగొండ:అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గొలుగొండ మండలం ఏఎల్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం లోచల రమేష్ పర్యవేక్షణలో దివ్యాంగలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం ఆధ్వర్యంలో రన్నింగ్, మ్యూజికల్ చైర్, షూటింగ్, చిత్ర లేఖనం ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రమణ, రామ్ కుమార్, రామ రాజు, అచ్చిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

రావికమతం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మేడివాడ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలో గల పలు పాఠశాలలకు చెందిన 45 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. మేడివాడ జడ్పీ హైస్కూలు ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు గోవిందరావులు దివ్యాంగ విద్యార్థులకు 50 మీటర్ల పరుగు పందెం, మ్యూజికల్ చైర్, డ్రాయింగ్, పాటల, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున మండల విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా బహుమతులను అందజేయడం జరుగుతుందని ప్రత్యేక ఉపాధ్యాయులు తెలిపారు .ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మేడివాడలో పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పారా మెడికల్ పోస్టులు గిరిజనులకే కేటాయించాలి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 256 వివిధ రకాల పారామెడికల్, మినిస్టీరియల్, ఒప్పంద పొరుగు సేవలు పోస్టులను వందశాతం స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రస్తుతం నియమిస్తున్న 4 రకాల పోస్టుల నియామకంలో గిరిజనేతరులకు కేటాయించిన 100 పోస్టులు వెంటనే రద్దు చేసి ఆదివాసీలకు కేటాయించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ మొత్తం 31 పోస్టులకు గాను గిరిజనేతరులకు 12 పోస్టులు కేటాయించడం దారుణమన్నారు. ఆఫీసు, సబర్డినేట్ మొత్తం పోస్టులు 269 పోస్టులకు 57 పోస్టులు గిరిజనేతరులకు కేటాయించారని, నరల్ డ్యూటీ అటెండెన్స్ మొత్తం 169 పోస్టులకు గాను 30 పోస్టులు గిరిజనేతరులకు కేటాయించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.జివో 3 ప్రకారం వందశాతం పోస్టుల నియామకాలు ఆదివాసులతో నియామకాలు జరపాలని డిమాండ్ చేశారు జివో 3 ప్రకారం జరపకపోతే ఆందోళన చేస్తామన్నారు.